క్లుప్తంగా

రజత వస్త్రానికి వెండి సమర్పణ



జంగారెడ్డిగూడెం వెండిని సమర్పిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకామల్మవారి రజత వస్త్రానికి భక్తులు వెండిని సమర్పించారు. శుక్రవారం సందర్భంగా అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. దాతలు నాగసూరి బాలసుబ్రహ్మణ్యం, 5 తులాలు, ఉయికె వీర్రాజు 5 తులాలు వెండిని సమర్పించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించామన్నారు. భక్తులు, కమిటీ, నూకాంబిక సేవా బృందంపాల్గొన్నారు.

నేత్రపర్వంగా చందనోత్సవం



చందనోత్సవం నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం సీతారామస్వామి ఆలయంలో శుక్రవారం సింహాద్రి అప్పన్నస్వామికి చందనోత్సవం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి చందనోత్సవాన్ని వీక్షించారు. దల్లి ఎల్లారెడ్డి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. స్వామి వారికి చందనోత్సవం అనంతరం విశేషంగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

అక్షయ తృతీయ పరశురామ జయంతి



పరశురామ విగ్రహం వద్ద జయంతి కార్యక్రమం

కొయ్యలగూడెం: అక్షయ తృతీయ పూజలు, పరశురామ జయంతి కార్యక్రమం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. టెంపుల్స్ సెంటర్‌లోని రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన పరుశురామ విగ్రహానికి పూజలు చేశారు. దశావతారాల్లో ఆరో అవతారమైన భార్గవ రాముని ఇతివృత్తాంతాన్ని అర్చకుడు గుడిపూడి శేషాచార్యులు వివరించారు. సప్త చిరంజీవుల్లో పరశురాముడు ఒకరని, అక్షయ తృతీయ తిథినాడు భార్గవ రాముడు జమదగ్ని మహర్షి, రేణుక మాతలకు జన్మించారని తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



గ్రంథాలయానికి పుస్తకాలను అందిస్తున్న గీతానారాయణ్

జంగారెడ్డిగూడెం: స్థానిక శాఖా గ్రంథాలయానికి గ్రీన్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, మాజీ సర్పంచ్ తల్లాడి సత్తిపండు కుమార్తె గీతానారాయణ్ శుక్రవారం పుస్తకాలను అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రూప్–1, గ్రూప్–2, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉపయోగపడే రూ.27 వేలు విలువైన 44 పుస్తకాలను గ్రంథాలయాధికారి దుర్గారావుకు అందించినట్టు గీతానారాయణ్ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలను అందిస్తానని పేర్కొన్నారు. పాఠకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఫ్లాప్ షో

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతిపక్ష నేత, టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నగరంలో చేపట్టిన ప్రజాగళం సభ అట్టర్‌ఫ్లాప్ అయింది. స్థానిక పన్నెండు పంపుల సెంటర్‌లోని నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన ఈ సభకు ఏ రోడ్డులోనూ రెండు వందలకు మించి జనం కనిపించలేదు. షెడ్యూల్ ప్రకారం 11.50 గంటలకు రావాల్సిన చంద్రబాబు సుమారు 2 గంటలు ఆలస్యంగా వచ్చారు. ప్రారంభించిన అరగంటకే తన ప్రసంగాన్ని ముగించారు. ఇందులో సీఎం జగన్‌ను విమర్శించేందుకే ఎక్కువ సమయం కేటాయించారు. కొందరు చంద్రబాబు రాకుండానే వెళ్లిపోగా, మరికొందరు చంద్రబాబు సభాస్థలికి వచ్చి వేదిక ఎక్కగానే వెళ్లిపోవడం కనిపించింది. మరికొంత సేపు ఉండండని వారిని టీడీపీ నాయకులు బతిమిలాడినా పట్టించుకోలేదు. కొందరు మహిళలు మీరిచ్చే రూ.150కి ఇంతసేపు నిలబడడమే ఎక్కువని చెప్పడంతో మిన్నకుండిపోవడం నాయకుల వంతైంది. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నానికి నేర చరిత్ర లేకపోవడం, నగరాన్ని విశేషంగా అభివృద్ధి చేయడం, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ రాజకీయాలకు కొత్త ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రత్యర్థి పార్టీ నాయకుల ఊసే లేకుండా తన ప్రసంగాన్ని ముగించారు. దీంతో నానికి, కారుమూరి సునీల్‌కు చంద్రబాబే స్వయంగా క్లీన్‌చిట్ ఇచ్చినట్లుగా స్థానికులు చర్చించుకున్నారు.

నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్ యాదవ్

కుక్కునూరు: నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్ కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోనీ 15 పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కుచర్లపాటి నరసింహరాజు ఇంటి వద్ద విలేకర్లతో మాట్లాడారు. గతంలో ఆసరా చెక్కులు పంపిణీకి కుకునూరు వచ్చి అక్కచెల్లెమ్మలతో మాట్లాడినట్టు చెప్పారు. తనను ఎంపీగా గెలిపిస్తే విలీన మండలాల్లో ఉన్న పలు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కో ఆర్డినేటర్‌ను ఏర్పాటు చేసి, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి నిర్వాసిత సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తాని చెప్పారు. ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని, దీనికి జగనన్న ఐదేళ్ల సంక్షేమ పాలనేనని వివరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేకూరాలనా, తారతమ్యాలు లేకుండా సంక్షేమ ఫలాలు అందాలన్నా మరోసారి జగనన్న ముఖ్యమంత్రి అవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తెల్లం రాజ్యలక్ష్మిని, ఎంపీగా తనను ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు తాండ్ర రాజేష్, గాడిద రామచంద్రం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాదిరాజు వెంకన్నబాబు, గంగుల రమణారెడ్డి, మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహారావు, స్థానిక నాయకులు సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ప్రచారంలో భాగంగా మహిళల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్



ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ కలిసి మద్దతు తెలుపుతున్న కుక్కునూరు యాదవ సంఘం నాయకులు

యాదవ సంఘం మద్దతు

ఎన్నికల ప్రచారానికి కుక్కునూరు వచ్చిన కారుమూరు సునీల్ కుమార్‌ను స్థానిక యాదవ సంఘం నాయకులు కలిసి తమ మద్దతు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో యాదవ సంఘం తరఫున ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బడుగు బుచ్చిబాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.

'పథకాలు, అభివృద్ధే వైఎస్సార్ సీపీని గెలిపిస్తాయి'



బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలందరూ వైఎస్సార్ సీపీకి పట్టం కడతారని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. శుక్రవారం జంగారెడ్డిగూడెంలో ఆమె మాట్లాడుతూ.. 'జంగారెడ్డిగూడెం పట్టణంలో సంక్షేమానికి సుమారుగా రూ.303 కోట్లు, అభివృద్ధికి రూ.18 కోట్లు ఖర్చు చేశాం. పట్టణలోని బుట్టాయగూడెం రోడ్డు నిర్మాణానికి రూ.1.72 కోట్లు, సూర్య కాలేజీ రోడ్డుకు రూ.76 లక్షలు, సాలిపేట రోడ్డుకు రూ.70 లక్షలు ఖర్చు చేశాం. గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో పట్టణ విస్తీర్ణం పెరిగింది. వీరందరికీ వైద్యం అందేలా రెండు అర్బన్ పీహెచ్‌సీలు నిర్మించాం. నీటి ఎద్దడి ఏర్పడకుండా బాలాజీ నగర్‌లో రూ.1.72 కోట్లతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. ఇవన్నీ జగన్ హయాంలోనే నిర్వహించ గలిగాం. జగనన్న చేయూత, ఆసరా, అమ్మఒడి, ఆరోగ్య శ్రీ, నవరత్న పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరింది. ఈ నేపథ్యంలో జగనన్న బలపర్చిన కంభం విజయరాజుని ఎమ్మెల్యేగా, సునీల్ కుమార్‌ని ఎంపీగా గెలవడం ఖాయం.' అని వివరించారు.

చెక్‌పోస్ట్ వద్ద పక్కాగా తనిఖీలు



జీలుగుమిల్లి చెక్‌పోస్ట్ వద్ద మాట్లాడుతున్న జోర్డాన్ బూటియా

బుట్టాయగూడెం: ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతోన్న నేపథ్యంలో అంతరరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద మరింత పగడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని ఏలూరు పార్లమెంటరీ ఎన్నికల వ్యయ పరిశీలకులు టి.జోర్డాన్ బూటియా అన్నారు. జీలుగుమిల్లి మండలం సమీపంలో ఇన్‌టిగ్రేటెడ్ చెక్‌పోస్టును శుక్రవారం ఆయన సందర్శించారు. తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిర్వహిస్తున్న తనిఖీలను పరిశీలించారు. వివిధ వాహనాలను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జోర్డాన్ బూటియా మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడుతూ ఉండడంతో చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నగదు, మద్యం, అక్రమ రవాణాను అరికట్టాలని ఆదేశించారు. తనిఖీల్లో సహాయ వ్యయ పరిశీలకులు ఏపీఎస్‌పీఎస్ శివనాగరాజు, తదితరుల పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చుతున్న సిబ్బంది

జంగారెడ్డిగూడెం: మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానే మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటుచేశారు. జంగారెడ్డిగూడెంలో శుక్రవారం రాత్రి స్థానిక పద్మథియేటర్ సమీపంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఈఈ పి.రాధాకృష్ణ, ఏఈ సునీతలు తమ సిబ్బందితో వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. మరమ్మతులకు గురికావడంతో వేరే 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను అప్పటికప్పుడు ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీంతో స్థానికులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు వినియోగంపై ప్రచారం

ఏలూరు (టూటౌన్): ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డీబీఆర్‌సీ ఏలూరు నగర కోఆర్డినేటర్ బలే సురేష్ పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయవాదుల గుమస్తా సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఓటు హక్కు వినియోగంపై దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. మానవత సంస్థ అధ్యక్షుడు మేతర అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి

టి.నరసాపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వల్లనే ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ పోలవరం అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. టి.నరసాపురం మండలం బండివారిగూడెం, మక్కినవారిగూడెం, మర్రిగూడెం పంచాయతీల పరిధిలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యే తనను, ఎంపీగా కారుమూరి సునీల్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీల, మైనార్టీల అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను నేరుగా అందించిన ఘనత ఆయనదే అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంస్కరణలను దేశంలో పలు రాష్ట్రాలు ఆదర్శంతంగా తీసుకుంటున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీను రాజు, సహకార సంఘం చైర్మన్ పిన్నమనేని చక్రవర్తి, ఎంపీటీసీ నులకాని నరసింహారావు, మాజీ సర్పంచ్ మక్కిన వెంకట గోపాలరావు, మందలపు మూర్తి, సిరిమళ్ల విష్ణు, రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకులు కురసం నిరీక్షణరావు, తాటి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ బుర్ల దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

తెడ్లంలో విస్తృత ప్రచారం

టి.నరసాపురం మండలం తెడ్లం గ్రామంలో గాది నరసింహారెడ్డి, ఎంపీటీసీ బండి వెంకటసుబ్బారావుల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేశారు. స్థానిక కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. తెడ్లం గ్రామంలో వైఎస్సార్ సీపీ మెజార్టీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మక్కినవారిగూడెంలో ప్రచారం చేస్తున్న రాజ్యలక్ష్మి



మక్కినవారిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు



తెడ్లంలో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం

గిరిజన గ్రామాల్లో హోరెత్తిన ప్రచారం



బుట్టాయగూడెం: గడ్డపల్లిలో ప్రచారం చేస్తున్న పార్టీ శ్రేణులు



బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం శుక్రవారం హోరెత్తింది. మారుమూల అటవీ ప్రాంతాల్లో సైతం ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌లను గెలిపించాలని కోరారు. బుట్టాయగూడెం, దొరమామిడి, కేఆర్‌పురం, కోయరాజమండ్రి, అచ్చియ్యపాలెం, కొమ్ముగూడెం, రెడ్డిగణపవరంతోపాటు పలు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం చేశారు. మారుమూల పాపికొండల అభయారణ్యం ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో కూడా పులిరామన్నగూడెంకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జీలుగుమిల్లి మండలం జీలుగుమిల్లి, ములగలంపల్లి, కామయ్యపాలెం, పాలచర్ల, తదితర గ్రామాల్లోనూ ప్రచారం హోరెత్తింది. ఈ ప్రచారంలో ఆయా మండలాల పరిధిలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు నల్లేరుపై నడకే

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రచారంతో ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మిల గెలుపు నల్లేరుపై నడకలా మారిందని ఆ పార్టీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం అచ్యుతాపురం పంచాయతీ శ్రీరంగపట్నంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన విస్తృత ప్రచారం చేశారు. గ్రామ కన్వీనర్ ముమ్మిడి రాంబాబు ఆధ్వర్యంలో మహిళలు ఇంటింటికి బొట్టు పెట్టే కార్యక్రమం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. శనివారం మండల వ్యాప్తంగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తామని, కార్యక్రమానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి హాజరవుతారని తెలిపారు.



బుట్టాయగూడెం : రాజీవ్‌నగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



కొయ్యలగూడెం : శ్రీరంగపట్నంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

స్థానికుణ్నే.. సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు

చింతలపూడి : ప్రజలకు అందుబాటులో ఉంటా, స్థానికున్నే, సమస్యలు పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. చింతలపూడి మండలం తిమ్మిరెడ్డిపల్లి, ప్రగడవరం, కనిపెడ, బోయగూడెం, భట్టువారిగూడెం, బాలువారిగూడెం, ఉర్లగూడెం గ్రామాల్లో శుక్రవారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తూ ప్రచారంలో ముందుకు సాగారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ.. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విజయరాజుకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. గ్రామ, గ్రామాన కార్యకర్తలు, నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ ప్రజల్ని మోసపూరిత మాటలతో మోసపుచ్చే పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ మామిళ్లపల్లి రాంబాబు, పట్టణ సచివాలయాల కన్వీనర్ బి.చెంచమరాజు, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం ఇమ్మానియేలు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గంధం చంటి, సీహెచ్ నరేంద్ర రాజు, ఎస్ కాంతారావు, వెంపా కృష్ణ, మిరియాల దిలీప్, వెంకటేశ్వర్రావు, తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడి పట్టణంలో ప్రజలకు అభివాదం చేస్తున్న కంభం విజయరాజు



ఉర్లగూడెం ప్రచారంలో పాల్గొన్న విజయరాజు

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



పంగిడిగూడెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ద్వారకాతిరుమల: సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉండి, జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ నేతలు ఓటర్లను అభ్యర్థించారు. ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురం, నారాయణపురం, బుట్టాయిగూడెం, ఎం నాగులపల్లి, గొల్లగూడెం, రామన్నగూడెం, దొరసానిపాడు, సీహెచ్ పోతేపల్లి, జి.కొత్తపల్లి, రామసింగవరం, ఐఎస్ రాఘవాపురం, ఐఎస్ జగన్నాథపురం తదితర గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్ సీపీ నేతలు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పాలన మళ్లీ కొనసాగాలంటే జగనన్నను సీఎం చేసుకోవాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యేగా తానేటి వనితను, రాజమండ్రి ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

చంద్రబాబువి మోసపూరిత హామీలు

జంగారెడ్డిగూడెం: చంద్రబాబు అబద్దాలతో 2014లో అధికారంలోకి వచ్చారని, తిరిగి 2024 అధికారంలోకి వచ్చేందుకు మరోసారి మోసపూరిత మాటలు చెబుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. జంగారెడ్డిగూడెం 4, 7 వార్డుల్లో శుక్రవారం వారు గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారని తెలిపారు. జగన్ మ్యానిఫెస్టోను వివరించారు. సీఎంగా మరోసారి జగన్‌ను చూసేందుకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కారుమూరి సునీల్ కుమార్, కంభం విజయరాజులను ఫ్యాను గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. చంద్రబాబు నైజాన్ని గుర్తించి, మాట ఇస్తే మడమ తిప్పని నాయకుడు జగన్‌ను గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో జెట్టి ఆదిత్య, పల్లా వెంకటరమణ, చిప్పాడ వెంకన్న, గగ్గల కిరణ్, నీలపాల అనిల్, ఆర్‌ఎంపీ శ్రీను, కొండయ్య, బోయిన సత్తిబాబు, కేబుల్ సురేస్, ఎన్ శివ, మాచవరపు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి జగన్‌కే సాధ్యం

చింతలపూడి : రాష్ట్ర అభివృద్ధి జగన్‌కే సాధ్యమని, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రగడవరం పంచాయతీలో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నవరత్న పథకాలను ప్రజలకు వివరించారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే అమ్మ ఒడి, వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్ తదితర పథకాలు కొనసాగుతాయని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కె.సునీల్ కుమార్ యాదవ్, కంభం విజయరాజులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.భూపతి, ఉప సర్పంచ్ ఎస్ రమేష్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శి లలిత కుమారి, నరసింహారెడ్డి, సత్యం, తాళ్లూరి రామకృష్ణారెడ్డి, కోటి రెడ్డి, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం : పట్టణంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చింతలపూడి : ప్రగడవరంలో ప్రచారం చేస్తున్న నాయకులు